ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
ఆదివారం 20 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm

# నిజామాబాద్‌లో రైతు మహోత్సవం

**3 రోజుల పాటు నిర్వహణ**

**150 స్టాల్స్ ఏర్పాటు**

**హాజరుకానున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**

నిజామాబాద్ : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'రైతు మహోత్సవం' నిర్వహిస్తోంది. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులతో పాటు రైతులకు అందే సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం రైతు మహోత్సవం నిర్వహించ చేపట్టింది. నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల మైదానంలో మూడు రోజుల పాటు (ఏప్రిల్ 21 నుంచి 23 వరకు) ఈ మహోత్సవం కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో దాదాపు 150 స్టాళ్లు నెలకొల్పాలని అధికారులు నిర్ణయించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా రానున్నారు.

నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అభ్యుదయ రైతులు రైతు మహోత్సవంకు హాజరుకానున్నారు. రైతులతో పాటు రైతు ఉత్పాదక సంస్థలు తమ అనుభవాలు పంచుకునేందుకు ఇది మంచి వేదిక కానుంది. సాంకేతిక పరిజ్ఞానంతో కొత్తగా మార్కెట్లోకి వచ్చే యంత్రాలు, పరికరాలు, నూతన వంగడాలు, మేలు రకం విత్తనాలను వ్యవసాయ అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు ప్రదర్శించనున్నాయి. పంట సాగుకు దోహదపడే డ్రోన్లు ఇక్కడ చూడొచ్చు. డెయిరీ, పట్టు పరిశ్రమ, చేపల పెంపకంలో వచ్చే లాభాల గురించి అధికారులు వివరించనున్నారు. ఈ రోజులు వసతులు, సౌకర్యాలన అధికారులు ఏర్పాటు చేశారు.

## చేవెళ్ల, రాజేంద్రనగర్లలో ఈ ఏడాది ఉప ఎన్నికలు



మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : త్వరలో జరిగే రాజేంద్రనగర్ ఉప ఎన్నికల్లో కార్తిక్ రెడ్డి గెలిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత నష్టపోయింది కేసీఆర్, బీఆర్ఎస్ కాదని.. ప్రజలే అని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మాయ మాటలకు ముసలోళ్లు, మహిళలు, నిరుద్యోగులు మోస పోయారన్నారు. మతం పేరు ఎత్తకుండా ఓటు అడిగే దమ్ము బీజేపీకి ఉందా? అని, బీజేపీ ఆటలు కూడా ఎన్నో రోజులు సాగవని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో రాజేంద్రనగర్ నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు.

'తొందర్లోనే రాజేంద్రనగర్ ఉప ఎన్నికల్లో కార్తిక్ రెడ్డి గెలిస్తారు. ఔటర్ లోపల చాలా సీట్లు గెలిచాం. రేవంత్ రెడ్డి మాయ మాటలకు ముసలోళ్లు, మహిళలు , నిరుద్యోగులు మోస పోయారు. వీళ్ళు చెబితే నమ్మరని.. సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో 420 హామీలు ఇప్పించారు. ఒక్కసారి అవకాశం ఇద్దామని మన వారు ఓట్లు వేశారు. అభివృద్ధి చేసిన వైఎస్సార్, చంద్రబాబు గురించి ఇంకా మనం చెప్పుకుంటాం. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంచి పనులు చేయరు. ఫ్రీ బస్ తప్ప ఏమీ చేయలేదు, దాని గురించి మాట్లాడితే మళ్లీ కేసులు పెడతారు' అని కేటీఆర్ అన్నారు. 'మతం పేరు ఎత్తకుండా ఓటు అడిగే దమ్ము బీజేపీకి ఉందా?. బీజేపీ ఆటలు కూడా ఎన్నో రోజులు సాగవు. చేవెళ్ల, రాజేంద్రనగర్లలో ఈ ఏడాది తప్పకుండా ఉప ఎన్నికలు వస్తాయి. ఉప ఎన్నికలు రావు అన్నందుకు సీఎం రేవంత్ రెడ్డిని సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. ఇప్పటి నుంచే ప్రచారానికి సిద్ధం అవ్వండి. ఈ నెల 27 జరగబోయే వరంగల్ సభను విజయవంతం చేయండి. నాయకులు కూడా బస్సులలో కార్యకర్తలతో కలిసి మీటింగ్‌కు రావాలి. సబితా ఇంద్రారెడ్డి కూడా బస్సులోనే మీటింగ్ వస్తారు. నలభై వేల బస్సులు మీటింగ్‌కు వస్తున్నాయి' అని కేటీఆర్ చెప్పారు.

## ఆర్టీసీలో ఉద్యోగాలు

# 3,038

**త్వరలో నోటిఫికేషన్..**






**ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్**

**సాధ్యమైనంత త్వరగా భర్తీ చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ : తెలంగాణలోని నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.

త్వరలోనే ఆర్టీసీలో 3,038 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆర్టీసీలో సుదీర్ఘ కాలం తర్వాత ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభిస్తుండడంతో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని త్వరలోనే నోటిఫికేషన్ వేసి సాధ్యమైనంత త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుంది.. దీని ద్వారా ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు ఆర్టీసీలో 165 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని వారు 5500 కోట్ల రూపాయలు ఆదా చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే మహా లక్ష్మి పథకం కింద కొత్త బస్సులు కొనుగోలు చేశామని ఇప్పుడు ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ సన్నద్ధం అయిందని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

## రష్మీకి సర్జరీ

తగ్గిన హిమోగ్లోబిన్
భుజం నొప్పి, అకాల రక్తస్రావం సమస్య
సర్జరీ తర్వాత ఆరోగ్యం నిలకడ
మూడు వారాల పాటు విశ్రాంతి
తీసుకోవాలని వైద్యుల సూచన

సినిమా: యాంకర్ రష్మీకి ఇటీవల శస్త్రచికిత్స జరిగింది. దీంతో అసలు తనకు ఏం జరిగింది, ప్రస్తుతం తన ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆమె పోస్టు చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో తనకు మద్ధతుగా నిలిచిన వైద్యులు, కుటుంబసభ్యులకు ఆమె ధన్యవాదాలు చెప్పారు.

"ఇలాంటి క్లిష్ట సమయంలో నాకెంతో అండగా నిలిచిన వారందరికీ ధన్యవాదాలు. సుమారు 5 రోజుల్లోనే నా శరీరంలో హిమోగ్లోబిన్ శాతం తొమ్మిదికి పడిపోయింది. జనవరి నుంచి నాకు ఏం జరుగుతుందో అర్థం లేదు. తీవ్రమైన భుజం నొప్పి, అకాల రక్తస్రావంతో ఇబ్బందిపడ్డాను. వైద్యులను సంప్రదిస్తే ముందు దేనికి ట్రీట్‌మెంట్ తీసుకోవాలో కూడా తెలియలేదు.

మార్చి 29 నాటికి పూర్తిగా నీరసించిపోయా. వర్క్ పరమైన కమిట్‌మెంట్స్ అన్ని పూర్తి చేసుకుని ఆసుపత్రిలో చేరా. ఏప్రిల్ 18న శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం నేను ఆరోగ్యంగానే ఉన్నా. మరో 3 వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలి" అని ఆమె తన ఇన్‌స్టా పోస్టులో రాసుకొచ్చారు. ఈ పోస్టుకు సర్జరీకి ముందు దిగిన ఫొటోలను పంచుకున్నారు.



## పాతబస్తీలో అంబేడ్కర్ విగ్రహం ఎక్కడైనా ఉందా?

**ఎంపీ అసదుద్దీన్‌కు బండి సంజయ్ కౌంటర్**

హైదరాబాద్ : పాతబస్తీలో ఎక్కడైనా అంబేద్కర్ విగ్రహం ఉందా? అని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. దారుస్సలంలో ఎమ్ఐఎమ్ నిర్వహించిన సభకు సీఎం రేవంత్ రెడ్డి సహకరించారని ఆరోపించారు. బడాబాబులు, బడాచోర్‌లు కలిసి మీటింగ్‌లు పెట్టుకున్నారని విమర్శించారు. అంబేడ్కర్ ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని గుర్తుచేశారు. సుప్రీంకోర్టుపై తమకు నమ్మకం ఉందని అన్నారు. తాము సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా ఏ పని చేయబోమని ప్రకటించారు. తెలంగాణలో వడగళ్ల వానతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటివరకు ఎంతమంది పరిహారం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నిన్న దారుస్సలం సభలో అసదుద్దీన్ ఒవైసీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ ముస్లింలను విభజించి బలహీన పరిచేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ముస్లింలపై కక్షసాధింపుగా రాజ్యాంగ వ్యతిరేక చట్టాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. దాన్ని ఉపసంహరించుకునేంత వరకూ అన్ని వర్గాలతో కలిసి దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని కీలక ప్రకటన చేశారు. అంబేడ్కర్ కంటే తానే గొప్ప వ్యక్తిననే తరహాలో మోడీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ 11 ఏళ్లుగా ముస్లింలను అణిచివేయటానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలకు బండి సంజయ్ స్పందించి కౌంటర్ ఇచ్చారు.



## పేద ముస్లింల లబ్ధికే వక్ఫ్ చట్ట లక్ష్యం

**కొందరు కావాలనే అసత్య ప్రచారం..**

**ఎంపీ డీకే అరుణ**

హైదరాబాద్ : వక్ఫ్ పై అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే చట్టం తెచ్చినట్లు తెలంగాణ బీజేపీ నేత, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాల్లో జేపీసీ పర్యటించిందని తెలిపారు. పేద ముస్లింలకు లబ్ధి చేకూరడమే వక్ఫ్ చట్టం లక్ష్యమన్నారు. కొందరు కావాలనే వక్ఫ్‌పై అసత్యం ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొందరి చేతుల్లోనే వక్ఫ్ భూములు ఉన్నాయని.. అవన్నీ దేశంలోని ముస్లిలందరికీ దక్కాలని ఆకాంక్షించారు. రోజురోజుకూ దేశంలో కాంగ్రెస్ పార్టీ దిగజారిపోతోందని అన్నారు. ప్రాంతీయ పార్టీగా రూపాంతరం చెందుతోందని విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని, ఆ బాధ్యత తమదే అని తెలిపారు.

ఇదిలా ఉండగా.. వక్ఫ్ (సవరణ) చట్టం చేసినందుకు ప్రధాని మోదీకి దావూదీ బోహ్రా ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు. సవరణ చట్టంలో తమ డిమాండ్లను పొందుపరిచినందుకు సంతోషం వ్యక్తంచేశారు. వీరు ఇటీవల ప్రధానిని కలిశారు.



షియా ముస్లింలలో దావూదీ బోహ్రాలు జనాభాపరంగా మైనారిటీలు. ఆర్థికంగా వీరు బలమైన వర్గం. వక్ఫ్ బిల్లుపై ఏర్పడిన పార్లమెంటరీ సంయుక్త కమిటీకి గతంలో దావూదీ హ్రాలు తమ సిఫారసులను సమర్పించారన్నారు. వీటి ఆధారంగా చట్టంలో ప్రభుత్వం కొన్ని సవరణలను చేసిందన్నారు.